సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



'మీన'మేషాలు ఇంకెన్నాళ్లు?

ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యకారులు ఎదురుచూస్తుండగా అధికారులు టెండర్ల పేరిట మీనమేషాలు లెక్కిస్తున్నారు. 8లో



... అక్రమార్కులపై చర్యలు

యూరియా అక్రమ తరలింపు వ్యవహారంలో ఇల్లెందు పీఏసీఎస్ సీఈఓ సస్పెండ్ కాగా, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

జ్వరాల వ్యాప్తి.. జాగ్రత్తలు

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో రేపు ఫోన్ ఇన్



డాక్టర్ రామకృష్ణ



భద్రాచలంఅర్బన్: భద్రాచలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ జ్వరాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' ముందుకొచ్చింది. ఈనెల 26న సోమవారం రోజున 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపడుతోంది. జ్వరాల నివారణకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

తేదీ : 26-08-2024, సోమవారం
సమయం :
మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ :
99590 86989

ఆశలకు రెక్కలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భౌగోళిక, సామాజిక అంశాలు అనుకూలంగా ఉన్నాయి. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పం కూడా తోడైతే అతి త్వరలోనే జిల్లాకు విమానయాన సేవలు అందుబాటులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు ప్రభుత్వ ప్రాధాన్యత

- కొత్తగూడెంలో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి కేంద్రం అనుకూలం
- ఆ తర్వాత ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే పర్యాటక రంగానికి ఊతం

ప్రభుత్వ ప్రాధాన్యతల్లో కీలకం..

రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న 19 పనులను నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధితో పాటు కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం కూడా ఉంది. రేవంత్‌రెడ్డి సీఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల తర్వాత ఆరు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ ప్రకటన వచ్చింది. ఇందులో కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు కాగా వరంగల్, పెద్దపల్లి, ఆదిలాబాద్ బ్రౌన్‌ఫీల్డ్‌గా ఉన్నాయి. అయితే ఇందులో వరంగల్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికే తొలి ప్రాధాన్యత లభించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కేంద్రం సానుకూలం..

జిల్లా సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న బస్తర్ ప్రాంతం మావోయిస్టుల కంచుకోటగా ఉంది. అక్కడి నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని తరిమేయడానికి కేంద్ర ప్రభుత్వం గత 15 ఏళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తోంది. మావోయిస్టులు – భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగినప్పుడు గాయపడిన జవాన్లను అనేకసార్లు భద్రాచలం వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి హెలికాప్టర్లలో మెరుగైన వైద్యం కోసం తరలించారు. కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లకు అవసరమైన మద్దతు వాయుమార్గంలో అందించేందుకు వీలు కలుగుతుంది. దీంతో కొత్తగూడెంలో ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉంది. ఈ మేరకు గత యూపీఏ, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వాలు పలుమార్లు ఇక్కడ సర్వే నిర్వహించాయి. మరోవైపు అయోధ్యలో బాలరాముడికి ఆలయం నిర్మించిన తర్వాత దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం అభివృద్ధిపై దృష్టి పెట్టాలనే ఒత్తిళ్లు కేంద్రంపై వస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా తోడ్పాటు అందితే ఎయిర్‌ఫీల్డ్ అందుబాటులోకి వచ్చేందుకు ఆస్కారం ఉంది. ఆ తర్వాత దశలో ఎయిర్‌ఫీల్డ్‌ను ఎయిర్‌పోర్టుగా వినియోగించుకోవచ్చు.

పదిహేనేళ్లుగా ప్రయత్నాలు

కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి 1000 ఎకరాల స్థలం అవసరం అవుతుందని అంచనా. యూపీఏ ప్రభుత్వ హయాంలో సుజాతనగర్ ఏరియాలో ఎయిర్‌పోర్టు వస్తుందని ప్రచారం జరిగినా అది కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక పేరు కొన్నాళ్లు వార్తల్లో నానింది. చివరగా మూడేళ్ల కిందట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు జిల్లాలో సర్వే నిర్వహించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో గుడిపాడు, పేట చెరువు, బంగారుజాల ఏరియాల్లో 1000 ఎకరాల స్థలం కోసం పరిశీలన చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక బృందాలు టెక్నో ఎకనామిక్ ఫీజుబులిటీపై క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించాయి. ఇందులో ఎయిర్‌పోర్ట్‌కు బదులు ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు గల అవకాశాలను ఎక్కువగా పరిశీలించారు.

టూరిజానికి అవకాశం..

భద్రాచలానికి భక్తులు ఎక్కువగా రోడ్డు మార్గంలో వస్తున్నారు. కొత్తగూడెం – పాల్వంచ – భద్రాచలం మధ్య ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశం నలుమూలల నుంచి భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా ఇటు టెంపుల్ టూరిజంతో పాటు అటు ఎకో టూరిజం అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే కిన్నెరసాని జలాశయం దగ్గర ఎకో టూరిజంలో భాగంగా చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా కన్సల్టెన్సీని నియమిస్తామని ప్రకటించింది. త్వరలోనే సీతమ్మసాగర్ పూర్తయి కరకట్ట నిర్మాణం జరిగితే సుమారు 40 కిలోమీటర్ల మేరకు గోదావరి తీరం వెంబడి జలాశయంతో పాటు రోడ్, బోట్ కనెక్టివిటీ పెరుగుతుంది. ఏపీలో పాపికొండలు, మారేడుమిల్లి, సీలేరు వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్తగూడెం గేట్‌వేగా మారుతుంది. సినిమా షూటింగ్‌లు సైతం పెరిగే అవకాశముంది.

పారిశ్రామిక రంగంలో..

జిల్లాలో సింగరేణి, హెవీ వాటర్‌ప్లాంట్, థర్మల్ విద్యుత్ కేంద్రం వంటి భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో నవభారత్, ఐటీసీ – పేపర్‌బోర్డు, పామాయిల్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. పాల్వంచలో సుమారు 1000 ఎకరాల స్థలం పరిశ్రమలకు అనుకూలంగా ఉంది. జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరైతే పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు మరింతగా వచ్చేందుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

'స్వయం ఉపాధి'తో గిరిజనాభివృద్ధి

ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్



అధికారులతో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

భద్రాచలం: గ్రామాల్లో లభ్యమయ్యే వనరులను సద్వినియోగం చేసుకుని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలతో గిరిజనులు అభివృద్ధి చెందేలా అధికారులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం వివిధ పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వారికే చెందేలా యూనిట్ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా మహిళలు తయారుచేస్తున్న సబ్బులు, షాంపూలు నాణ్యతగా ఉన్నాయని, వీటికి దేశ, రాష్ట్ర స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ట్రైకార్ ద్వారా గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీతో విద్యుత్ మోటార్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వైటీసీ ద్వారా నిరుద్యోగ గిరిజన యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు సూచించారు. గిరిజన సంక్షేమం కోసం కొత్త పథకాలు ప్రవేశపెట్టడానికి ఈనెల 31న గిరిజన శాసనసభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొన్ని ఐటీడీఏలలో బ్యాంకు లింకేజీ ద్వారా లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతోందని, వాటిని వెంటనే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. గిరిజనులు తయారు చేసే వస్తువులు, ఆహార పదార్థాల పరిశ్రమల ఏర్పాటుకు ఊతం ఇచ్చి మహిళల సంక్షేమానికి కృషి చేస్తామని, దీనికి తగిన ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రైకార్ నిధులు వృథా కాకుండా ప్రతి గిరిజన కుటుంబం సద్వినియోగం చేసుకునేలా ఉండాలని, దీనిపై అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ట్రైకార్ జీఎం శంకర్‌రావు ట్రైకార్ ప్రగతిని వివరించారు. అనంతరం ఎంఎస్ఎంఈ, ట్రైకార్ ద్వారా లబ్ధి పొందిన గిరిజన యువత అభిప్రాయాలు, అనుభవాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. వైటీసీ ద్వారా కంప్యూటర్ శిక్షణ పొందిన గిరిజన యువతకు పత్రాలు అందజేశారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ట్రైకార్ అడిషనల్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీ సీతారామచంద్రస్వామి వారిని బెల్లయ్యనాయక్ దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఓ రమాదేవి జ్ఞాపిక అందజేశారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రయత్నిస్తా..

పాల్వంచరూరల్ : పాల్వంచలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం, వెనుకబడిన వర్గాలకు ట్రైకార్ నిధుల మంజూరు కోసం ప్రయత్నం చేస్తానని ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. స్థానిక కాంట్రాక్టర్స్ కాలనీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నేతలు రమేష్‌రాథోడ్, బానోత్ రవికుమార్ అధ్యర్యంలో బెల్లయ్యనాయక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాసం రామకృష్ణ దొర, సోయం సత్యనారాయణ, మోహన్, బిక్కులాల్, అనిల్, ప్రసాద్, బాలకృష్ణ, దారా శ్రీనివాసరావు, బాబురావు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌డబ్ల్యూఎస్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న జీఎం జగ్గారావు

అశ్వాపురం: భారజల కర్మాగారం గౌతమీనగర్ నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవాన్ని గౌతమీనగర్ కాలనీలో అణుశక్తి కేంద్రీయ విద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భారజల కర్మాగారం జీఎం జగ్గారావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో గౌతమీనగర్ కాలనీ వాసుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అనంతరం అణుశక్తి కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సెక్రటరీ అజయ్‌కుమార్, డైరెక్టర్లు, ఉద్యోగులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అగ్ని ప్రతిష్ఠ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఆధ్వర్యంలో శ్రీమద్ భాగవత సప్తాహంలో భాగంగా శనివారం చిత్రకూట మండపంలో అగ్ని ప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధన, సేవాకాలం, శాత్తుమురై, దశమ స్కంధ హోమం జరిపించాచారు. కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్



మాట్లాడుతున్న భాస్కర్ నాయక్

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి భాస్కర్ నాయక్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విష జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మోతాదుకు మించి మందులు ఇవ్వొద్దని, భారీ స్థాయిలో గ్లూకోజ్‌లు వంటివి పెట్టొద్దని సూచించారు. జిల్లాలోని ప్రతీ ఆర్ఎంపీ వైద్య శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు జ్వరం వస్తే డెంగీ అంటూ కొందరు ఆర్ఎంపీలు ప్రజలను దోచుకుంటున్నారని, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రమణమూర్తి

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.రమణమూర్తిని నియమించారు. ఈ మేరకు డీఎంఈ నుంచి శనివారం ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రాజ్‌కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా, రమణమూర్తి ప్రిన్సిపాల్‌గా ఎప్పుడు బాధ్యతలు స్వీకరిస్తారనేది తెలియాల్సి ఉంది.

భూ సమస్యల పరిష్కారానికే నూతన చట్టం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి
- ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూ సమస్యల పరిష్కారం కోసమే నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడించారు. సర్కారు ప్రవేశపెడుతున్న నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనల కోసం కలెక్టరేట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువత, నిపుణులు, పాత్రికేయులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన అంశాలను చట్టంలో పొందుపర్చాలని సూచించారు. ధరణిలో ఉన్న లోపాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, వాటిని పరిష్కరించడంతోపాటు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిబంధనలు చేర్చాలని సూచించారు. భూ సర్వే నిర్వహించాలని, భూమిపై ఉన్న రైతులను మాత్రమే నమోదు చేయాలని కోరారు. పాత చట్టాలను మార్చి కొత్త చట్టాలను ప్రతి సంవత్సరం పహాణీల్లో నమోదు చేయాలని, శిస్తు వసూలు మళ్లీ పెట్టాలని, ఆర్ఓఆర్‌ను సవరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నూతన చట్టం రూపకల్పనలో రైతులు, ప్రజలు, మేధావులను భాగస్వామ్యం చేసేందుకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. బిల్లు అంశాలు, రైతుల భూ రికార్డులు పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశంతో ముసాయిదా బిల్లుపై అందరి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని వివరించారు. నూతన రెవెన్యూ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ror2024& rev@telangana. gov. in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయొచ్చని సూచించారు. ముసాయిదా బిల్లులో పొందుపర్చిన అంశాలను సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓలు మధు, దామోదర్‌తో ఆయా సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

'ఓపెన్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2024 – 25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్ల వాల్ పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారు, వారి పనులు చేసుకుంటూనే ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ చదువును పూర్తి చేయొచ్చన్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని ఆయా శాఖల అధికారులు ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, మాధవరావు, సమగ్ర శిక్ష సీఎంఓ సైదులు, మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

15మందికి కారుణ్య నియామక పత్రాలు



ఉత్తర్వులు అందుకున్న వారితో ఏరియా జీఎం శాలేంరాజు తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల వారసులు 15 మందికి శనివారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో కారుణ్య నియామకాల ప్రక్రియను పునరుద్ధరించగా.. ఇప్పటివరకు కొత్తగూడెం ఏరియాలో 599 మందికి ఉద్యోగావకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూనే ఇంటర్నల్ పరీక్షలు రాసి పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాకారులు జీవీ.కోటిరెడ్డి, మురళి, నాయకులు జె.గట్టయ్య, కె.అరవింద్, రామ్లా ప్రసాద్ పాల్గొన్నారు.

'చేయూత' అందేనా ?

- రెండున్నరేళ్లుగా కొత్త పింఛన్ల ఊసే లేదు..
- అర్హులకు తప్పని ఎదురుచూపులు
- సదరం ఉన్నా.. దివ్యాంగులకు దక్కని ధైనం



చుంచుపల్లి: ఆసరా పింఛన్ల కోసం అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పేరును 'చేయూత'గా మార్చింది. అయితే ఇప్పటివరకు పింఛన్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో అర్హులైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండున్నరేళ్లుగా పలువురు ఈ పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ముందు మంజూరవుతాయని అందరూ భావించినా నిరాశే మిగిలింది. దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తయినప్పటికీ.. ఆ వివరాలను ఆన్‌లైన్ చేసే అవకాశం కూడా ప్రస్తుతం లేకుండా పోయింది. ప్రభుత్వం రెండున్నరేళ్లుగా ఈ ప్రక్రియను నిలిపేసింది. గతంలో ప్రతీ నెల కొత్త పింఛన్లు మంజూరు విధానం అమల్లో ఉండేది. అయితే గత రెండున్నరేళ్లుగా ఆ ఊసే లేకుండా పోయింది. ప్రతి రోజూ అర్హులు దరఖాస్తు చేసుకుంటుండగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి, అర్జీలను పక్కన పెడుతున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పింఛన్లు మంజూరు ప్రక్రియను ఆపేయడంతో దరఖాస్తుదారులు సంబంధిత గ్రామ పంచాయతీ, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దివ్యాంగులకూ దక్కని ఆసరా..

జిల్లాలోని దివ్యాంగులు ఆసరా పింఛన్ కోసం ముందుగా సదరం శిబిరానికి హాజరయ్యేందుకు ఆధార్‌తో ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుంటారు. వారికి కేటాయించిన తేదీ ప్రకారం సదరం క్యాంపునకు హాజరైతే వైద్య పరీక్షలు చేసి వైకల్యాన్ని నిర్ధారిస్తారు. 40 శాతానికిపైగా వైకల్యం ఉన్న వారు పింఛన్‌కు అర్హులవుతారు. దివ్యాంగులు సదరం ధ్రువ పత్రాలతో ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. అక్కడ ఆన్‌లైన్‌లో నమోదు చేసి, డీఆర్డీఏ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి అధికారులు పరిశీలించి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తారు. అయితే ఈ ప్రక్రియ సైతం రెండున్నరేళ్లుగా నిలిచిపోయింది. జిల్లాలో క్రమం తప్పకుండా సదరం శిబిరాలు ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నా కొత్త పింఛన్లు మాత్రం అందడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సదరం క్యాంపుల ద్వారా1,160 మంది దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేశారు. వారంతా ఆసరా పింఛన్ మంజూరు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దివ్యాంగులకు పింఛన్ ఇచ్చి 'ఆసరా' కల్పించాలని పలువురు వేడుకుంటున్నారు.

పెండింగ్‌లో వేల దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ పథకంలో భాగంగా ప్రతినెలా దివ్యాంగులకు రూ.4,016 ఇస్తుండగా, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు, బోదకాలు, ఎయిడ్స్, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.2,016 చొప్పున అందజేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 1,18,074 మందికి ఆసరా పింఛన్ అందుతోంది. అయితే గతేడాది చివరలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. ఆ తర్వాత కొత్త సర్కార్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరాను చేయూతగా పేరు మార్చిందే తప్ప పింఛన్ల మంజూరులో మాత్రం ఎలాంటి కదలిక లేదు. ప్రజాపాలనలోనూ అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో జిల్లా వ్యాప్తంగా కొత్తగా 69,136 దరఖాస్తులు అందాయి. ఇందులో దివ్యాంగులు 7,438 మంది ఉండగా, ఇతర పింఛన్ల కోసం 61,698 మంది దరఖాస్తులు సమర్పించారు. గతంలో విచారణ పూర్తయిన వాటితో పాటు ప్రజాపాలనలో కొత్తగా వచ్చిన వేలాది దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందనేది అధికారులు సైతం స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి అర్హులందరికీ చేయూత అందించాలని పలువురు కోరుతున్నారు.

తాలిపేరుకు పెరుగుతున్న వరద

25 గేట్లు ఎత్తి 63,889 క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల: తాలిపేరుకు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లలో 21 గేట్లను రెండేసి అడుగులు, 4 గేట్లను పూర్తిగా ఎత్తి 63,889 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో దిగువన ఉన్న తాలిపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని 73.46 మీటర్లుగా నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద సిబ్బందిని అప్రమత్తం చేశారు.



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరదనీరు

క్లుప్తంగా

31 నుంచి బెంచ్‌ప్రెస్ పోటీలు

భద్రాచలంటౌన్: హైదరాబాదులోని బాలానగర్‌లో ఈ నెల 31, సెప్టెంబర్ 1న రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ ప్రధాన కార్యదర్శి జీవీ రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 26వ తేదీ లోగా అసోసియేషన్‌కు పూర్తి వివరాలను పంపాలని కోరారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపినవారిని అక్టోబర్ నెలలో గోవాలో జరిగే నేషనల్ బెంచ్ ప్రెస్ పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

మరమ్మతులు చేపట్టినా మళ్లీ లీక్

మిషన్ భగీరథ పైపులైన్‌ను పరిశీలించిన డీఈ



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకవుతున్న ప్రాంతం

పాల్వంచరూరల్: పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి 24గంటలు గడవకముందే మళ్లీ లీకై నీళ్లు వృథాగాపోతున్నాయి. మండల పరిధిలోని పెద్దమ్మగుడి వెనుక ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ మూడు రోజుల క్రితం పగిలిపోవడంతో శుక్రవారం గ్రిడ్ అధికారులు రూ.3 లక్షలతో మరమ్మతులు నిర్వహించారు. శనివారం తాగునీటిని పునరుద్ధరించారు. అయితే నీటిని పైపులైన్ ద్వారా విడుదల చేసిన కొన్ని గంటల్లోనే మరమ్మతులు చేపట్టి ఎయిర్ వాల్వ్ వేసిన ప్రదేశంలో మళ్లీ లీకై తాగునీరు బయటకువస్తోంది. సమాచారం అందుకున్న గ్రిడ్ డీఈ సాయి లీక్ అవుతున్న పైపులైన్‌ను పరిశీలించారు. నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపడతామని తెలిపారు.

28, 29 తేదీల్లో సింగరేణి మెడికల్ బోర్డ్

సింగరేణి (కొత్తగూడెం): ఈ నెల 28, 29 తేదీల్లో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. మొదటిరోజు ప్రీ మెడికల్, రెండో రోజు మెడికల్ బోర్డ్ నిర్వహించి, కార్మికుల అనారోగ్య సమస్యలను గుర్తించి, మెడికల్ రిపోర్ట్ ఆధారంగా కార్మికులను అన్‌ఫిట్(ఇన్‌వాలిడేషన్) చేయనున్నారు. మెడికల్ బోర్డ్‌లో ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకత కోసం కార్మికులను పరీక్షించేందుకు హైదరాబాద్ నుంచి వైద్య నిపుణులను రప్పిస్తున్నారు. అయితే సింగరేణి ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది హైదరాబాద్ నుంచి డాక్టర్లలో కొంతమంది సాయంతో దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జబ్బులతో బాధపడేవారిని అన్‌ఫిట్ చేయకుండా, జబ్బులు లేనివారిని అన్‌ఫిట్ చేస్తున్నారని, ఇందుకోసం రూ. లక్షలు చేతులు మారుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కాగా మెడికల్ బోర్డు ప్రక్రియపై సంస్థ ఉన్నతాధికారులు నిఘా పెట్టినట్లు సమాచారం.


ఉపాధ్యాయురాలి వేతనం విడుదల

దుమ్ముగూడెం : విధులకు హాజరుకాకపోవడం , సమయ పాలన పాటించకపోవడంతో మానుగట్టు ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలుకు జూలై నెల వేతనం నిలిపివేశామని ఎంఈఓ సున్నం సమ్మయ్య శనివారం తెలిపారు. అయితే మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకుంటానని సదరు ఉపాధ్యాయురాలు వివరణ ఇవ్వడంతో వేతనం విడుదల చేశామని పేర్కొన్నారు.

దాడి చేశారని అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు

పాల్వంచరూరల్: తనపై దాడి చేశారని మండల పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ తేజావత్ సుజాత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విధుల్లో ఉండగా బి.రాములు అనే వ్యక్తి స్కూల్‌కు వచ్చి దాడి చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా.. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



శ్రావణి(ఫైల్)

పాల్వంచరూరల్: భర్త వేధింపులు తాళలేక నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత శుక్రవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన వజ్జా నర్సింహారావు కుమార్తె పడిగె శ్రావణి(21)కి మూడేళ్ల క్రితం బంజర గ్రామానికి చెందిన భిక్షంతో వివాహం జరిగింది. కాగా కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య కలహాలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తాళలేక శ్రావణి ఈ నెల 21న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలు తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

‘మీన’మేషాలు ఇంకెన్నాళ్లు..?

- ఉచిత చేపపిల్లల పంపిణీకి మత్స్యకారుల ఎదురుచూపులు
- ఇంకా టెండర్ పూర్తికాలేదని చెబుతున్న అధికారులు
- సొంత ఖర్చుతో కొనుగోలు చేసి చెరువుల్లో వదులుతున్న మత్స్యకారులు



కిన్నెరసానిలోని చేపల ఉత్పత్తి కేంద్రంలో నిరుపయోగంగా మారిన తొట్లు

పాల్వంచరూరల్: ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు మాత్రం పంపిణీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇంకా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తికాలేదు. దీంతో చేప పిల్లలను ఇస్తారో? లేదోనని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కాలం గడిచిపోతుండటంతో వారే సొంత ఖర్చులతో చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో వదులుకుంటున్నారు. గత నెల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. జాప్యం చేయకుండా చేప పిల్లలను జలాశయాల్లో వదిలితే వేసవికాలం నాటికి ఎదిగి దిగుబడి పెరిగి మత్స్యకారులకు ఆదాయం సమకూరుతుంది. దీంతో ఆర్థికభారమైన ఏపీ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసుకుని వస్తున్నారు.

తగ్గనున్న చేపల రకాలు

మత్స్యకారులకు తోడ్పాటునందించేలా కొన్నేళ్లు ప్రభుత్వం ఉచితంగా వివిధ రకాల చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. బొచ్చె, బంగారు తీగ, మిడిగాల తదితర రకాల చేప పిల్లలను అందిస్తోంది. కానీ ఈసారి మత్స్యకారులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావడంతో ఆర్థికభారం పడుతోంది. దీంతో అన్ని రకాలను కొనలేక ఒకే రకం చేప పిల్లలను కొంటున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు.

కిన్నెరసానిలో వెలవెలబోతున్న తొట్లు

పాల్వంచ మండలం కిన్నెరసానిలోని చేప పిల్లల విత్తన ఉత్పత్తి క్షేత్రంలో 18 నీటి తొట్లు ఏర్పాటు చేశారు. వీటిల్లో మత్స్యశాఖ అధికారులు ఏటా 20 లక్షల చేపపిల్లలను పెంచుతారు. జూలై చివరి, ఆగస్టు మొదటి వారాల్లో చేప పిల్లల గుడ్ల(స్పాయన్)ను తీసుకొచ్చి తొట్లలో వదులుతారు. ఈసారి ఇంతవరకు చేప పిల్లల గుడ్లను పోయలేదు. దీంతో నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. కాగా ఇందులో పెంచిన చేపపిల్లలను గిరిజన మత్స్యసొసైటీలకు పంపిణీ చేస్తారు.



చేప పిల్లలను కొనుగోలు చేస్తున్న మత్స్యకారులు

ప్రణాళిక సిద్ధం చేసినా..

చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదిలేందుకు గత జూలైలోనే మత్స్యశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది జిల్లాలో 734 చెరువుల్లో 1.76 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. శీలావతి, బంగారుతీగ, బొచ్చె రకాల చేప పిల్లలను తెప్పించాలని, 80 నుంచి 100 మి.మీ. సైజు కలిగినవాటిని జలాశయాల్లో, 35 నుంచి 40 మి.మీ సైజు కలిగిన వాటిని చెరువులు, కుంటల్లో వదిలేలా ప్రణాళిక రూపొందించారు. కానీ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో పంపిణీపై సందిగ్ధం నెలకొంది.

మేమే కొనుక్కుంటున్నాం..



గత నెల వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. ఇప్పుడు చేప పిల్లలను వదిలితేనే వేసవిలోగా మూడు, నాలుగు కేజీల స్థాయికి పెరుగుతాయి. అప్పుడే కాస్త ఆదాయం వస్తుంది. కానీ ప్రభుత్వం ఇప్పటిదాకా పంపిణీ చేయకపోవడంతో మేమే కొనుగోలు చేస్తున్నాం.

–రామకృష్ణ, మత్స్యకారుడు

టెండర్ పూర్తి కాలేదు



ఈ ఏడాది ఉచిత చేపపిల్లల పంపిణీకి ప్రణాళికను రూపొందించాం. అయితే ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. టెండర్లు పూర్తి చేసి వచ్చే నెల మొదటి వారంలో చేప పిల్లలను పంపిణీ చేస్తాం. చెరువుల్లో వదిలేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖాధికారి

16 మందికి అస్వస్థత

- కలుషిత ఆహారమే కారణమా..?
- తాగునీటి శాంపిళ్లు సైతం పరీక్షలకు..
- పాల్వంచ మండలం పాతసూరారంలో ఘటన



పాల్వంచ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు

పాల్వంచరూరల్ : ఒకే రోజు రెండు ఫంక్షన్లకు హాజరైన వారిలో 16 మంది వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్న ఘటన పాల్వంచ మండలం పాత సూరారంలో చోటుచేసుకుంది. ఇందులో పరిస్థితి విషమంగా ఉన్న ఊడుగుల నాగమ్మను హైదరాబాద్, ఇరుప యాకూబ్‌ను ఖమ్మం, ఆదినారాయణ, వీరభద్రను కొత్తగూడెం ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారు పాల్వంచ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని మూడు కుటుంబాలకు చెందిన 16 మంది రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి మరో ఫంక్షన్‌కు హాజరయ్యారు. కలుషిత ఆహారం తినడం వల్లే వీరంతా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆ వీధి ప్రజలు డైరెక్ట్ పంపింగ్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని తాగుతుండడంతో ఆ శాంపిళ్లను కూడా పరీక్షల నిమిత్తం పంపించారు. జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యులు రాజు, మోహార క్రాంతి, కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు ఇమానియేల్, బాలాజీనాయక్‌తో పాటు ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డి, ఎంపీఓ బి.నారాయణ గ్రామంలో పరిస్థితిని పరిశీలించి మురుగునీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించారు. కలుషిత ఆహారం వల్లే 16 మంది అస్వస్థతకు గురై ఉంటారని ఎంపీడీఓ అనుమానం వ్యక్తం చేశారు. తాగునీటి శాంపిళ్లను సైతం పరీక్షలకు పంపించామని, ఆ నివేదిక ఆదివారం వస్తే కానీ అసలు కారణం ఏంటనేది తెలుస్తుందని చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామానికి చెందిన తొగరు శ్రీకాంత్ జూలూరుపాడు నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన స్టాలిన్ బైక్‌పై పాపకొల్లు నుంచి జూలూరుపాడు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయంలో సమీపంలోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగ, చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

టేకులపల్లి: ఇల్లెందు నుంచి టేకులపల్లి వైపు ప్రయాణికులతో టాటా మ్యాజిక్ వాహనం శనివారం వస్తుండగా, గోలియాతండా వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. దీంతో టాటా మ్యాజిక్ వాహనంలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

వంట గదిలో నాగుపాము



గ్యాస్ స్టౌ దగ్గర పడగ విప్పిన నాగుపాము

అశ్వారావుపేటరూరల్: ఓ ఇంటి వంట గదిలో నాగపాము ప్రత్యక్షమైన వీడియో, ఫొటోలు శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రెండు రోజుల క్రితం అశ్వారావుపేటలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మల్లికార్జున్‌రావు ఇంట్లోని వంట గదిలో గ్యాస్ స్టౌ వద్ద పాము కనిపించింది. పడగ విప్పి బుసలు కొట్టడంతో ఇంట్లో వారంతా భయాందోళనకు గురయ్యారు. ఆ పాము రెండు గంటలు అక్కడే ఉండటంతో స్థానిక ఫారెస్టు బీట్ ఆఫీసర్ నరేష్‌కు, పాములను పట్టుకునే ప్రదీప్ అనే వ్యక్తికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రదీప్ వచ్చి ఆ పామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించాడు. తర్వాత ఎఫ్‌బీఓ ఆ పామును సమీప అటవీ ప్రాంతంలో వదిలేశారు. కాగా, వంటింట్లో పడగ విప్పి బుసలు కొడుతున్న నాగపామును ఫొటోలు, వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అయింది.

లారీ కిందకు దూసుకెళ్లిన కారు

కానిస్టేబుల్‌కు గాయాలు

పాల్వంచ: ఓ కారు లారీ కిందకు దూసుకెళ్లిన ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం పట్టణంలోని కేఎస్‌ఎం బంక్ వద్ద పాల్వంచ వైపు వస్తున్న లారీ కిందకు వెనుక నుంచి వస్తున్న కారు దూసుకుపోయింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో హెయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న కానిస్టేబుల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

హోంగార్డుకు తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ హోంగార్డుకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న ఐతపు వెంకటరమణ విధులు ముగించుకుని కాలినడకన ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంతమార్కెట్ సమీపంలో వెనుక నుంచి దూసుకొచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

కాపర్ వైరు చోరీపై కేసు నమోదు

దమ్మపేట: కాపర్ వైర్ చోరీపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాయి కిశోర్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి వద్దగల విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉన్న 10 కేజీల ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. చోరీకి గురైన కాపర్ వైరు విలువ రూ.11వేలు ఉంటుందని అంచనా. సబ్ స్టేషన్ ఏఈఈ ఎ.సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ పోగుల సురేష్ కథనం ప్రకారం... తొమ్మిదోమైలు తండాకు చెందిన తేజావత్ ధంజ్యా(68) శుక్రవారం రాత్రి గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో వృద్ధుడికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స కోసం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అమర్‌సింగ్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు తోలెం సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్, జాహ్నవి

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు : భద్రాచలం పట్టణంలో శనివారం ఓ ప్రేమ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట గ్రామానికి చెందిన ఆళ్ల గణేష్, పారెపల్లి జాహ్నవి తొమ్మిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి జాహ్నవి కుటుంబసభ్యులు వీరిద్దరినీ పలుమార్లు హెచ్చరించారు. ఇటీవల ఆ బెదిరింపులు మరింతగా పెరగడంతో ఇద్దరూ ఇంట్లో నుంచి పారిపోయి ఈనెల 19న భద్రాచలం వచ్చి స్థానికంగా ఉన్న ఓ అమ్మవారి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. తిరిగి ఈనెల 21న బుధవారం ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకుమార్‌ను కలిసి విషయం వివరించారు. స్పందించిన ఎస్పీ కేసుకు సంబంధించిన వివరాలను స్థానికంగా ఉన్న డీఎస్పీకి తెలియజేసి, వీరిద్దరికీ రక్షణ కల్పించాలని ఆదేశించారు. అయినప్పటికీ పోలీసుల నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో గణేష్, జాహ్నవి తిరిగి ఈనెల 22న మళ్లీ భద్రాచలం వచ్చారు. ఈ క్రమంలో శనివారం జాహ్నవి కుటుంబసభ్యులు, బంధువులు.. గణేష్‌కు బావ వరుసైన మందపాటి రాజు మధ్యవర్తిగా వ్యవహరించి గణేష్, జాహ్నవిల వివాహం చేశాడనే అనుమానంతో జంగారెడ్డిగూడెం సమీపంలోని మైసన్నగూడెం గ్రామంలో ఉన్న రాజుపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు రాజు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గణేష్, జాహ్నవి ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తాగారు. అనంతరం తమను అశ్వారావుపేటలో దించాలని ఓ ప్రైవేట్ ట్యాక్సీ మాట్లాడుకుని వెళ్తున్న క్రమంలో బూర్గంపాడు మండలం సారపాక వద్దకు చెరుకునేసరికి ఇద్దరూ కారులోనే వాంతులు చేసుకున్నారు. దీంతో భయాందోళనకు గురైన కారు డ్రైవర్ ఇద్దరినీ సారపాకలోనే దింపి వెళ్లిపోయాడు. కాగా గమనించిన స్థానికులు వెంటనే బూర్గంపాడు పోలీసులకు సమాచారం అందజేయగా చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రామకృష్ణ
- విద్యార్థులతో కలిసి కేఎంసీ కార్యాలయం ముట్టడి



కేఎంసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రాల్లోని సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలనే డిమాండ్‌తో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి శనివారం ఖమ్మం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈక్రమంలో లోనకు వెళ్లేందుకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో గేటు వద్దే బైఠాయించి నినాదాలు చేశారు. ఆతర్వాత కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ వచ్చి సమస్యలు తెలుసుకుని వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ హాస్టళ్లలో పారిశుద్ధ్యం లోపించి పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, ఫలితంగా విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు.

యూరియా అక్రమార్కులపై చర్యలు

- పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్
- సీఈఓతోపాటు డీసీసీబీ డైరెక్టర్, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు



పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న డీసీఓ ఖుర్షీద్

ఇల్లెందురూరల్: యూరియా అక్రమ తరలింపుపై అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టారు. ఇల్లెందు పీఏసీఎస్ సీఈఓను సస్పెండ్ చేయడంతోపాటు గోదాం యజమాని అయిన డీసీసీబీ డైరెక్టర్, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. పీఏసీఎస్ స్టాక్ పాయింట్ నుంచి 70 యూరియా బస్తాలు మాణిక్యారంలోని డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు గోదాంకు చేరగా, కొమరారం ఎస్సై సోమేశ్వర్ గురువారం రాత్రి విచారణ నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా సహకార అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్, వాహన డ్రైవర్ ఉపేందర్‌లపై కేసు నమోదు చేయాలని సిఫారసు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా శనివారం పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించిన డీసీఓ ఖుర్షీద్ కార్యాలయ రికార్డులను, విచారణ నివేదికను సరిచూశారు. వెంటనే పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో స్టాఫ్ అసిస్టెంట్ హీరాలాల్‌కు బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయశాఖ ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్ శనివారం మాణిక్యారం గ్రామంలోని ఎరువుల గోదాం, ఫెర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించారు. గోదాం యజమాని, పీఏసీఎస్ సీఈఓ, డ్రైవర్‌లపై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గోదాం యజమాని, పీఏసీఎస్ సీఈఓకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. యూరియా అక్రమ తరలింపు వ్యవహారంపై సహకార, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ఉత్తమ డిపోగా సత్తుపల్లి

- ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఖమ్మం కొత్త బస్టాండ్
- రీజియన్‌లో ఐదుగురు ఉద్యోగులకూ అవార్డులు



మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి టౌన్: రాష్ట్రంలోనే టీజీఎస్ ఆర్టీసీలో ఉత్తమ డిపోగా ఖమ్మం రీజియన్ పరిధి సత్తుపల్లి బస్ డిపో, ఉత్తమ బస్ స్టేషన్‌గా ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ప్రగతి చక్రం పురస్కారాలు దక్కాయి. ఏటా ఉత్తమ డిపో, బస్టాండ్, ఉద్యోగులను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తుండగా ఈ ఏడాది సత్తుపల్లి డిపో, ఖమ్మం కొత్త బస్టాండ్‌కు చోటు దక్కింది. కాగా, సత్తుపల్లి డిపో 2022 నుంచి లాభాల బాటలో పయనించడంతో పాటు ప్రమాదరహితంగా కాక ఇతర కేటగిరీల్లోనూ ప్రతిభ చూపడంతో గతేడాది రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించగా ఈ ఏడాది ప్రథమ స్థానంలో సాధించడం విశేషం. ఇక బెస్ట్ పీఎంస్ కోర్ గ్రూప్ సూపర్‌వైజర్‌గా రీజనల్ కార్యాలయం నుండి బి.సైదులు, బెస్ట్ మెకానిక్‌గా మణుగూరు డిపోకు చెందిన పి.రవి, బెస్ట్ హెల్పర్‌గా మణుగూరు డిపోకు చెందిన డి.సతీష్‌కుమార్, బెస్ట్ హైర్ బస్ డ్రైవర్లుగా సత్తుపల్లి డిపోకు చెందిన సీహెచ్.కిషోర్‌బాబు, కె.రాంబాబు ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డులు ప్రదానం చేశారు. రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఆధ్వర్యాన సత్తుపల్లి డిపో తరఫున రూ.3లక్షల నగదు బహుమతిని మేనేజర్ యూ.రాజలక్ష్మి, ఖమ్మం కొత్త బస్టాండ్‌కు వచ్చిన అవార్డును ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, స్టేషన్ మేనేజర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా,రీజియన్‌లో సత్తుపల్లి డిపో, ఖమ్మం కొత్త బస్టాండ్‌తో పాటు ఐదుగురు ఉద్యోగులకు అవార్డులు రావడంపై ఆర్ఎం సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భవానీప్రసాద్, జీఎస్.పవిత్ర హర్షం వ్యక్తం చేశారు.

హైవే అలైన్‌మెంట్ మార్చాలని వినతి



రైతులతో చర్చలు జరుపుతున్న అధికారులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ – అమరావతి నేషనల్ హైవే అలైన్‌మెంట్‌ను ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల నుండి కొదుమూరు వరకు మార్చాలని కామంచికల్‌లో భూములు కోల్పోతున్న రైతులు కోరారు. ఈసందర్భంగా రైతులతో చర్చలు జరపడానికి శనివారం వచ్చిన ఆర్‌డీఓ గణేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికే తమ వద్ద తీసుకున్న భూములకు తక్కువ పరిహారం చెల్లిస్తానని చెప్పారని.. అలా కాకుండా విలువైన భూములను వెనక్కి ఇచ్చేసి హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. ఈ చర్చల్లో తహసీల్దార్ రాంప్రసాద్, ఎన్‌హెచ్ అధికారులతో పాటు నాయకులు బొంతు రాంబాబు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వి.రాధాకృష్ణ, సుధీర్, గాంధీ, వెంకటయ్య, పాటి వెంకటేశ్వర్లు, రఘు తదితరులు పాల్గొన్నారు.